## కథ



# ఒడువని దొరిర్కం

జూపాక సుభద్ర

'కూరంతేస్కోని తిన్నవానె. నాగ్గింత తుసురగూడుంచకుంట తిన్నావె' అని కార్తిక్ కూరగిన్నెలెతుక్కోని సెల్లెనన్నడు కోపంగ.

'నేనెందుకు దిన్న కూర' అన్నది అన్నను జూసుకుంట లలిత.

'పొద్దంతింటికాడుండి నేనెందుకు తిన్ననంటవేందే' అని ఆకలి మంట మీద లలితను వొక్కటి బీకిండు. లలిత వో... వో... అని బొబ్బబెట్టుకుంట 'నన్నెందుగ్గొడ్తవురా బాడ్కావ్' అని తిట్టింది.

'బాడ్కావ్ అంటావ్' అని యింకోటి బీకిండు.

'ఓ అమ్మో నేంజత్తనే, కార్తీగ్గాడు ననుజంపుతడే' అని మొత్తుకుంటాంటె యింటి పక్కపొంటి గుడిసెల వున్న లలిత నాయినమ్మ 'ఏందే లొల్లీ..' అనుకుంట కట్టె పొడుసుకుంటూ వచ్చి 'ఎందికే కీసులాడ్తంట్రు, మీ అమ్మింక రాలేదే' అని బైట నిలుసోని ఏడుస్తున్న మనుమరాలి దగ్గెరికి బొయి అన్నది.

'సూడే ఎల్లవ్వ కూరలేదని నన్ను గొడ్తాండే గీ బేగాడు' అని మల్లా ఏడుపందుకున్నది.

'వారీ ఇయ్యాల్ల మీ అమ్మ కూరే అండలేదుగాదుర, అదేడికెల్లి వుంచుతదిర'

'ఎందుగ్గొట్టి సంపుతున్నవురా పోరినీ' అని మనుమన్ని అదిలిచ్చింది. గా రాజేశ్వరరావు దొర రమ్మంటండని మీ అయ్యవ్వలు నోట్లె మంచినీల్లు బొయ్యక పొయింట్రురా, యింక రాకపాయె ఏమాయెనో ఏందో ఆల్ల పర్షాండ్ల ఆల్లుంటే మీ లొల్లి మీకు' అని పక్కన కట్టె బెట్టి కొడుకు సారయ్య, కోడలు శాంత కోసం సూసుకుంట కూసున్నది ఎల్లమ్మ. కార్తీకు గివన్ని ఏంబట్టిచ్చుకోకుంట కారప్పొడేసుకొని బాకుతండు.

శాంతమ్మ, ఆమె భర్త సారయ్య దొర అర్జంటుగ మాట్లాడాలె రమ్మని పొద్దుటి కాన్నుంచి యిద్దరు ముగ్గుర్ని తోలిండు. ఓ దిక్కు దుక్కులు దున్నుడున్నది, ఏదన్న పని గుత్తకిత్తడేమోనని మొగడు పెండ్లాలు దొర

కాడికి వురికింద్రు.

దొర యింటి సుట్టు పెద్ద పడారి గోడున్నది. మద్దెల భవంతి సుట్టు పూలసెట్లు, కూరగాయల సెట్లు, సేదబాయి, బోరింగు, నల్ల వున్నయి. యింటి ముందట అంత శాబాది బండ బరిసున్నది. పడారి దాటి భవంతి ముందట అరుగుల మీద కూసున్నరు, 'దొరెందుకు బిల్సెనో' అని.

యింట్ల నుంచి వచ్చే రాజేశ్వర్రావుని జూసి నిలుసున్నరు.

'శాంతమ్మ బాగున్నవా బిడ్డ. ఈ మద్దెన కనవడ్తనే లేరేంది' అని 'కూసోంద్రి బిడ్డా. అయ్యో! గీ కాలంల గవన్నేన్నో పొయినయి, కూసోంద్రి' అనుకుంట సారయ్య బుజమ్మీద సెయ్యేసి వాళ్ళ కెదురంగ కుర్చి జరుపుకొని కూసున్నడు.

పులి అసొంటి దొర భుజమ్మీద సెయ్యేసేటాలకు ఏందో తెలువని సంతోషమైంది సారయ్యకు.

యాడాదెల్ల దున్నులు, తొడిమేసే దానికి నాట్లు, కలుపుకోతలకు దొర వూల్లె ఒక్కోసారికి ఒక్కొక్కరికి గుత్త పనులప్పజెప్పుతడు. అందర్ని నమ్మడు. బాగ నమ్మకంగ అనిపిచ్చినోల్లకే పనులు గుత్తకిస్తడు. అట్లా శాంతమ్మ దొర గుత్తపనులు చాలా మంచిగ నమ్మకంగా ఓ పైస తక్కువగ్గూడ జేసింది. యిగ శాంతమ్మ పెనిమిటి గూడ దొర పంచాయితి ఆఫీసు పనుల్ల, యూత్ సంగపోల్లండ్ల తిరుగుతడు.

'మీ అవ్వను దావుకాండ్లేసింద్రన్నరు యిప్పుడెట్లుంది పిలగా' వచ్చిన పని చెప్పకుండా వాల్లను మెల్లమెల్లగా తన మాటదిక్కు తిప్పుకునేదానికి.

'ముండ్ల పొరుక కొడ్తాంటె కంట్ల సిన్న పేడిరిగిం దాట దొరా. ఆపేషన్‌జేసి తీసింద్రు. గిప్పుడు మంచిగనే అటీటు తిరుగుతంది' అన్నడు సారయ్య. దొరకెదురుగ కూసోని తన మంచిసెడ్డ మాట్లాడుడు ఏనుగెక్కినంత సంబురంగున్నది సారయ్యకు.

యింతల తిననీకి మిక్చరు, తాగనీకి చాయలచ్చినయి.

'చాయల్దాగుంద్రి బిడ్డా, పిలువంగనే వస్తిరి' అని రాజేశ్వర్రావు చాయల్దిక్కు చెయి చూపిచ్చి తను వొక చాయందుకున్నడు.

శాంత, సారయ్యలు కొంచెం మొగమాట పడుతూ 'మాకెందుకు దొరా, గిప్పుడింటికి బొయి తినమా. మీరు తాగుంద్రి' అన్నరు.

'అయ్యో శాంతా, పొద్దున పొద్దున్నే అచ్చింద్రు నా మాటమీన... యింటికాడ మీ బువ్వ కూరెటువో తది, ఎటువోదుగాని తాగుంద్రి' అన్నడు యింక కొంచెం మొగమాటపెడుతూ...

గుత్త పనుల మీద చానసార్లు దొరింటికచ్చినా ఎన్నడు గింతచాయ బొయ్యలే, గింత తిననీకియ్యలేదుగని గిప్పుడు గీ దొర కొత్త మర్యాదలెందుకు జేత్తండోనని శాంతకు కడుపుల గుడగుడయితంది. చాయల్దాక్కుంట కారబుక్కుకుంట, వూల్లె సంగతులెట్లున్నయి, ఎవరేం పొజిషండ్లున్నరు అనే సోల్తీలు దీసి మాట్లాడిండు రాజేశ్వర్రావు.

సారయ్య, శాంతలను మాటతోని ముచ్చటతోని కలుపుకొని, చాయ కారతోని యింక కొంచెం సల్లజేసిండు.

'ఆ.. వూల్లె ఏమనుకుంటంద్రు బిడ్డా' అసలు ముచ్చట మొదలుబెడుతూ...

'గిదే ఎలక్షన్ల మీదనే మాట్లాడుకుంటంద్రు దొరా' అన్నడు సారయ్య మూతి తుడుసుకుంట.

తన నోటినుండి బయటవడుడెందుకని సారయ్యతోనే తెల్లగిచ్చిండు రాజేశ్వర్రావు.

'ఈసారి మనూరు ఎస్సీ మహిళ కొచ్చిందెర్కే గద' అన్నడు మెల్లగ...

'అవు దొరా'

'మరి మన గూడాలల్ల మనోల్లేమనుకుంటుంద్రు బిడ్డా'.

మన గూడెం, 'మనోల్లు' అనే మాటలు శాంతకు, సారయ్యకు దొరమీద కొంచెం కడుపులెదిరింది.

'ఇంకేమనుకుంటలేరు దొరా, అనుకున్నా లెల్లొల్లంగాదు తప్పెటోల్లం గాదు గా. ఎలక్షండ్ల నిలుసునుడు మాతోనైతదా దొరా' అన్నడు సారయ్య.

తన పాలివాడు పాపారావును గురించి పైకి చెప్పకుండా 'వూల్లె గీ సంగతిని ఇంకెవ్వలు మాట్లాడ్కుంటలేరా, ఎవలు ఎవల్ని నిలబెడ్తలేరా' అని మల్లా వొత్తి అన్నడు సారయ్యను, శాంతను జూసుకుంట.


శాంతకు దొరెందుకు పిలిసి నాసవెడుతున్నడో పొడొలె అర్దమైతన్నా గూడ నమ్ముకం యింక కుదురుత లేదు.

'అవు శాంతా, గీ ఎలక్షండ్ల తల్లి ముండమొయ్యా గీసారి ఎస్సీ మహిళకచ్చింది బిడ్డా... నాకు శాన సంతోషంగున్నది' లోపల వుడుక్కుంటనే అన్నడు రాజేశ్వర్రావు.

'సారయ్యా..., బిడ్డా.. శాంతా! మిమ్ముల్నెందుకు బిల్సిన్నో... మీ కర్తమయే వుంటదనుకుంట. మనూల్లె ఎవలు నిలబడ్డా వూరు ఆగంగాకుంట సూసెటోల్లు కావాలె. వూల్లె కొట్లాటలు, దంపులాటలు జేసేటోల్లు మనకద్దు బిడ్డా. మనూరు మంచిగ బాగుపడాలె. వూరికోసం జేసేటోల్లు గావాలె, అందరితోని మంచిగుండెటోల్లు గావాలె...

'అవుదొరా, గసొంటోల్లయితేనె వూరు మంచిగుంటది' సారయ్య మాట కలిపిండు. గిన్నేండ్ల సంది గీ దొర, దొర పెండ్లమే గద రాజకీయమేలింద్రు. వూల్లె ఏం సక్కదనం జేసింద్రు. గిప్పుడు మాటల్జెప్పుతుంద్రు. ఎస్సీవోల్ల కచ్చెటాలకే గిన్ని జాగర్తలు యాదికచ్చినయా. గిన్ని రోజు లెటువొయినయి గీ జాగర్తలు అని మన్సుల్నే అనుకున్నది శాంతమ్మ.

రాజేశ్వర్రావు ఆ వూరికి పెద్దదొర, మాజీ సర్పంచి, వందెకరాలకు ఆసామి. వూల్లె సబ్బండ కులాలతోని సాకిరి జేపిచ్చుకున్న దొరతనం. సర్కారు భూముల్ని పట్టా జేసుకున్నయి కొన్ని, వూల్లె సిన్నసితుకోల్ల భూముల్ని కబ్జా జేసుకున్నయి కొన్ని. రాజకీయం జేసినయి కొన్ని. అన్ని గలుపుకొని భూసామైండు. అట్లా అన్నింటికి ఆసామై చెక్రం దిప్పుతండు. యిప్పుడు ఎలక్షండ్లత్తన్నయనీ, ఈసారి వూరు ఎస్సీ మహిళకు రిజర్వయిందని యిని కంటిమీన కునుకుదియ్యలే. తన మాట యినేటోల్లయితేనే తనకు అధికారం జెడకుంట, కనుసన్నల్లో అధికారం నడ్వాలె. తనను దాటి నడిస్తే యిగ వూల్లె తనకు పెత్తనమేం నిలవడ్తది అనుకున్నడు. గీ ఎస్సీలు యిదివరకు 'తిన్నావుర బస్వా అంటే తిన్న, పన్నావుర బస్వా అంటె పన్న' అనేటట్లు లేరు. అందరు హుశారైంద్రు కొడుకులు. ఎవన్ని మందలిచ్చే వశమైతలేదు. వాల్లను కలుపుకోవాలంటె జెర పెద్దంత్రం సిన్నంత్రం జూడకుంట జెరకిందికి దిగి రావాల. దువ్వినట్లు ప్రేమగ మాట్లాడి, తాగిపిచ్చి, తినిపిస్తే వాల్లే పడ్తరు కాళ్ళకాడనుకున్నడు. అండ్లమల్ల పాలివాడు పాపారావు సేతిల కొందరు ఎస్సీలున్నరు. 'పిల్లి సడ్డ మాలితె ఎలుక గూడ ఆడిత్తది'. అట్ల గాకుంట సూసుకోవాలెనని తన మాట మీద గురుంచే ఎస్సీలను సోల్తీ దీసుకొంటె సారయ్య పేరు తట్టింది. జెర సెప్పిన పని జేత్తడు. 'దొరెందిరో ఆని పీకుడేందిరో' అనే మనిసిగాదు అనుకొని సారిగాని పెండ్లానికిత్తె గీ సర్పంచి నా సేతుల కెళ్ళి యేడికి బోదని మీద్దికింద, కిందిది మీద వెట్టి ఆలోచన జేసి ఒక నిర్ణయా



నికొచ్చి కుంటమీద సారయ్య, శాంతలను పిలిపిచ్చుకున్నడు.

'సారయ్యా నీ సంగతి సిన్నప్పటి కాన్నుంచి ఎర్కని జెప్తన్న. గాల్లు గీల్లెందుకు మన శాంతనే నిలబెడ్దామేంది' అన్నడు శాంత మ్మను జూసుకుంట.

రాజేశ్వర్రావ్ ఆ మాటనంగనే శాంతకు, సారయ్యకు కాల్జె య్యాడలేదు. ఒకరి మొకాలొకరు జూసుకున్నరు.

'అబ్బో కూలినాలి జేసుకునేటోల్లం మాకెందుకు దొరా సర్పంచిగిరీ' శాంతన్నది వద్దన్నట్టు.



'నువ్వద్దంటె సర్కారూకుంటదా, గీ సట్టం దీస్కచ్చిందే మీకోసమాయె. నువ్వు గాకుంటే ఎవలన్న ఎస్సీ ఆడోల్లు నిలవ డ్తరు. నిలవెడితే గది లెక్కేంది, జెర మంచోల్లను బెడ్తె వూరికి బర్కతుంటది. యిన్ని రోజులు సర్పంచిగ జేసినోన్ని, వూరికి పెద్ద మనిషినని తండ్లాటతోని నిన్ను వుండమంటన్న శాంత' అన్నడు ఎంతో బాధపడ్తున్నట్లు రాజేశ్వర్రావు.

'దొరా నువ్వు నా పేరు జెప్పి పిలిపిచ్చినవుగనీ, మాకు సదువు రాదేంరాదు. గంత పైసె బెట్టే ఐషతేది దొర...'

'అరే గట్ల మాట్లాడ్తవేందే. గవన్నీ నేన్సాయం జెయ్యనానె'...

సారయ్యకు దొరబిల్సి మాట్లాడి సర్పంచిగిరి యిస్తనంటె యిగ మాకేం తక్కువ. గీ యెడ్డిది ఏందో వద్దన్నట్లు మాట్లాడ్త దేంది, నక్కందొక్కినట్లు గింత మంచి అవుకాశం దొరిత్తనంటే సదువని సంకని వద్దనుడేంది, అటిటు నసిగితే మేంగాకుంటె యింకోలకిత్తడు అనుకుని ... 'సరె మీ యిష్టమే దొరా మీరెట్లంటె అట్లనే' అన్నడు సారయ్య వెంటనే.

'వారీ పోడా... ఖుల్ల ఖుల్ల మాట్లాడ్కుందాం. గీ సర్పంచి నీ భార్యకిస్తే మంచిగుంటదనుకున్న. ఎందుకంటే మీరు ఎవల జోలికి బోరు. వార్తకు బోరు. గండ్ర గొండోల్లు గాదు గర్కా సోల్లు గాదని, మీరైతేనే వూరు బాగైతదని అనుకుంటున్న. వూరు లొల్లిగిల్లి లేకుంట వుండాలని నీ భార్య శాంతను నిలవె డ్దామనుకుంటన్నరా బిడ్డా... యింకో దిక్కు పాపారావు దొంగల్ని, లంగల్ని నిలబెట్టే ప్రయత్నాలు జేస్తండు. గాని దుర్మార్గం మనూల్లె జరుగద్దు. గందికే మంచోల్లని మీరే సర్పం చిగ జేసి వూరు సల్లగుంచుతరని, దానికోసం నా తనువు తాకట్టు వెట్టైనా మిమ్ముల గెలిపిత్త. పైసలు, గీసలు అన్ని నేనే జూసుకుంట' అని భరోసా యిచ్చి 'ఏమంటరు' అని వాల్ల సమాదానం కోసం జూడకుంటనే 'నా మాటమీద నమ్మకం లేదా బిడ్డా... రాకరాకచ్చింది మంచిగ కుర్సీల గూసుంటవు. అందరు సలాంబెడ్తరు. గీ కూలినాలికి వొయేదే వుండదు. ఎందుకే శాంతా! అనుమానం. యిగ మీరేమాలోసించకుండ్రి. అందరు నేంజేత్త, నేంజేత్తనని ఎగవడ్తాంటె మీరేందే యిత్తనం టన్నా వద్దంటుండ్రు.'

'లచ్చిమత్తాంటె తడ్క అడ్డంబెడ్తరా' రాజేశ్వర్రావ్ అన్నడు యింకా వూరించుకుంట.

'సారయ్యా, నీ భార్యను యింటికి దీస్కపోయి మాట్లాడు. దాని అనుమానాలన్నీ నిమ్ముతంజెయి' అని యింకా చాలా నమ్మకంగా, ఒక్కింటోల్లమే అన్న తీరుగ 'నేనున్న మీతోటి' అనే టాల్లకు యిద్దరికి అంత అయిషతి లేకున్నా దొరమీది భరోసా తోని మొకాలు నిండుపున్నమై సరె అని యింటికి బొయిండ్రు.

శాంతకు చాలా అనుమానాలున్నయి గానీ సారయ్యకు భార్య సర్పంచవుడు, కుర్సి మీద కూసునుడు, ముఖ్యమైన మని షిలాగ వూల్లె తిరుగుడు, జెండెత్తుడు, నమస్తె అనుడు యివన్ని కండ్లల్ల మెదిలి 'నువ్వేం బయపడకు. పదవి ఎవ్వని సొత్తు. రాజాకరాజులు అసొంటి దొరలు జేసిన సర్పంచిగిరి ఏ అదురు ష్టమో యింట్లకత్తె వద్దని ఎందుకనుడు' అని శాంతను వొప్పి చ్చిండు.

దొర దగ్గెర్నించి ఇంటికచ్చే తొవ్వల్నే...

వాకిట్ల ఎంటికలిరబోసుకొని ఏడ్సుకుంట కూసున్న బిడ్డం జూసి 'ఏమైందిరా వావ్వ ఎవలు గొట్టిండ్రు' అని బిడ్డెకండ్ల నీల్లు తుడ్సి కొడుకు కొట్టిండని తెల్సి కొడుకును తిట్టింది. సారయ్య కాల్లు గడుక్కొనచ్చిండు సంతోషంగ. 'అరేయ్, గిప్పుడు దాన్ని గొడితె రేపు పెద్దయి సర్పంచయినంక నీ పంగలు బాయదీత్త దిరా' నవ్వుకుంట అన్నడు, భార్యయినట్లు రేపు బిడ్డగూడ సర్పంచయితదనే ఉద్దేశంతో. 'వారీ గీ వొక్క రోజే కూర లేదని వుర్కులాడితివి. యిగ మీ అమ్మ సర్పంచయితే నీ తిండి రోజూ కూరలేని కారం తిండేర బిడ్డా' అన్నడు కొడుకుతోని వుషారుగ.

దొర సర్పంచిగ శాంతను నిలవడుమన్న సంగతి, సాయం ముచ్చట యింట్ల తల్లితోని అన్నదమ్ములతో కులపోల్లందరితోని చెప్పిండు సారయ్య.

పాలివాడు పాపారావు నిలబెట్టినామెను వోడించి శాంతని గెలిపిచ్చిండు రాజేశ్వర్రావు. శాంత పేరుకే సర్పంచి గాని పాపా రావు మీద గెలుపు నాదేనని మీసం మెలేసిండు రాజేశ్వర్రావు. అదేగాక తనుగూడ ఉపసర్పంచిగ గెల్సిండు. యిగ పట్టపగ్గా ల్లేవు. ఆ వూల్లె అందరు రాజేశ్వర్రావునే పొగుడుతుండ్రు. వూరే గింపుల జీబుల దొర డాబుగ నిలవడితే పక్కపొంటి శాంత ఏనుగు పక్కన ఎల్కపిల్లోలె వున్నది. శాంతకు గిదంతా కొత్తకొ త్తగున్నది. సారయ్య పక్కన దైర్నానికున్నడు గానీ సారయ్య గూడ సదువురాదు, ఏందెలువదని. 'ఏం భయంలేదే ఎట్ల జెయ్యాలె, ఏంజెయ్యాలె అంత దొర జెప్తడు తియ్యి, నారుబోసి నోడు నీరు బొయ్యడా' అని సదిరి సెప్పిండు సారయ్య. యిదివ రకు 'ఏందే శాంత రాయే... పోయే' అన్నోల్లందరు 'నమస్తె సర్పంచి' అంటాంటె మంచిగనిపిస్తంది శాంతకు. ఒక్క దొర జెప్పిందేగాదు అన్ని కులాల యిండ్లల్లకు వొయి మాటముచ్చట నేర్సుకున్నది మెల్లమెల్లగ. ఇన్ని రోజులు కూల్లకు నాల్లకు పిల్సిన పరిచయమున్నా, యిప్పటి కత వేరు. వూల్లె సమస్యల మీద మాట్లాడుడు ఎంఆర్‌వో ఆఫీసులకు వెళ్ళడం, 'ఫండా ఎక్కడిది? ఉపసర్పంచి రాజేశ్వర్రావునడుగు అన్ని జెప్తడు' అని రికార్డు మూసేసి ఎల్లిపోయిండు కార్యదర్శి.

'దొరనడుగననే గీని పోకడ. యీడు ఆడు దొంగలు. దొంగలు దొంగలు వూల్లు పంచుకున్నట్లే వున్నది. గీ కార్యదర్శి ఎప్పుడు కలువడు, ఆఫీసుల కూసోడు. ఎప్పుడొస్తడో ఎప్పుడు వోతడో తెల్వనే తెల్వదు. గింత మర్మమిచ్చి మాట్లాడడు. ఎప్ప టికి ఉపసర్పంచి రాజేశ్వర్రావింటికే పోతడు. యీల్లిద్దరే గల్సి ఫండ్సు తెస్తండ్రు. కర్సువెడ్తండ్రు' అనే సంగతి గూడ తెలవదు శాంతకు.

'వాల్లు వీల్లు అంటాంటె, వేరే వూరి సర్పంచి పద్మమ్మ సెప్తె తెలిసింది, ఫండ్సచ్చినయని. రెండ్లేండ్ల నుంచి 10 లక్షలొచ్చిన యని. వూరంతడుగుతుండ్రి. ఒక్క రోడ్డేయించలేదని, గా కాల్వలు పూడ్కపోతన్నయి, అదన్న తవ్వియ్యి. ఫండేస్మైతన్న యని వూల్లె జనం నన్ను పీక్కతింటుండ్రు. నేనేం జేద్దును' అని ఎదురుగ కూసున్న పెనిమిటి సారయ్యతోని, వార్డు మెంబరు యాదయ్యతోని అన్నది శాంత.

'అరె ఎందుకు బాదపడ్తవు శాంతక్కా. దొర నిన్ను నిల్సో బెట్టి కర్సు వెట్టినయన్ని డబులుకు డబులు వసూల్జెయ్యనీకే. నీకింకా అర్తంగాలేదా' అన్నడు వార్డు మెంబరు యాదయ్య.

'ఎందుకర్తంగాలేదు యాదన్నా. గిన్నిరోజులు ఆల్లే రాజ్యాలే లింద్రు. గిప్పుడు మన పేరుతోని గూడ ఆల్లే రాజ్యాలేల్తండ్రు, ఎటుబడి రాజ్యాలేలుడు యిడ్సిపెట్టలె వాల్లు' గియన్నెట్ల మారాలెనని ఆలోచన జేసుకుంట రికార్డులు అటుయిటు తిప్పు కుంట పంచాయితాఫీసులనే కూసున్నది శాంత.

★

'ఎందుకర్తం గాలేదు యాదన్నా. గిన్ని రోజులు ఆల్లే రాజ్యాలేలింద్రు. గిప్పుడు మన పేరుతోని గూడ ఆల్లే రాజ్యాలేల్తండ్రు, ఎటుబడి రాజ్యాలేలుడు యిడ్సిపెట్టలె వాల్లు'